క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


డ్రోన్ల వినియోగం గురించి వివరిస్తున్న అధికారులు

వల్లూరు : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈవో పీఆర్‌డీ ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని లేబాక, కొప్పోలు గ్రామాలలో శుక్రవారం వికసిత భారత సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను గురించి వివరించారు. అనంతరం డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. వికసిత భారత సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పాలెం సురేష్‌కుమార్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

జమ్మలమడుగు : 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా తమపేర్లను నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గురప్ప తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఓటర్ల నమోదుపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఆయుధంతో సమానం అన్నారు. ఓటు హక్కులేని వారు దేశీయులు కాదన్న విషయాన్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీలు వేణు, షఫి తదితరులు పాల్గొన్నారు.

వేమన పుస్తకాల పంపిణీ

జమ్మలమడుగు : వేమన జయంతి సందర్భంగా పట్టణంలో త్రైత సిద్ధాంత కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వేమన శతక పుస్తకాలను పంపిణీ చేశారు. శుక్రవారం కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులనిచ్చే విత్తనాలను వాడాలి

జమ్మలమడుగు : రైతులు అధిక దిగుబడులను ఇచ్చే విత్తనాలను వాడాలని వ్యవసాయశాఖ శిక్షణ కేంద్రం ఏఈ శైలజ తెలిపారు. శుక్రవారం మండలంలోని శేషారెడ్డిపల్లె గ్రామంలో రైతులకు పంటలు సాగుబడి చేసే విధానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ మండలాల్లో పంట సరళిని బట్టి విడుదలైన నూతన విత్తన రకాలను వ్యవసాయశాఖ అధ్వర్యంలో రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు సాగుచేసిన శనగ పంట సక్రమంగా దిగుబడులు రాకపోతే అంతర పంటగా ధనియాలు, అవాలను వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ గురుశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. శుక్రవారం కడపలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ కమీషన్ ఏర్పాటు చేసినా దానిమీద ఎటువంటి పురోగతి లేదన్నారు. ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ వర్గాలతోపాటు భారతీయులందరి గుండెల్లో శాశ్వతంగా కొలువై ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం చాలా సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శేషగిరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. గంగరాజు, జిల్లా కార్యదర్శి కట్టా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలను తెలుపుకోవాలని ఆయన కోరారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

నేడు రైతులతో సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. రాయచోటి – చాగలమర్రి హైవే రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రొద్దుటూరు మండలంలో భూములు కోల్పోయిన గోపవరం, ప్రొద్దుటూరు, నంగనూరుపల్లె, కొత్తపల్లె గ్రామాలకు సంబంధించిన రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’తో ఆరోగ్యానికి భరోసా

చక్రాయపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మారెళ్లమడక సచివాలయం వద్ద జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బంది పనితీరుపై ప్రజలను అడిగి తెలసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్యులు మీ ఊరికే వచ్చి వైద్య సేవలు అందిస్తారన్నారు. దీనికి తోడు ప్రభుత్వం రూ.25 లక్షలకు పెంచిన ఆరోగ్యశ్రీ కార్డు కూడా మీకు ఎంతో దోహద పడుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ప్రజల వైద్యం కోసం ఇంత ఖర్చు చేయలేదని ఇలాంటి పథకాన్ని అమలులోకి తీసుకురాలేదన్నారు.

అనంతరం ఆయన మారెళ్లమడక బీసీ కాలనీలో పర్యటించి అక్కడ నిలువ ఉన్న నీటి గుంతను పరిశీలించి అందులో దోమల నివారణ మందులను చల్లించారు. ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను సుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో వెంకటరెడ్డి, చక్రాయపేట వైద్యాధికారిణి వాణి, ఎంపీడీవో శివారెడ్డి, ఆరోగ్య సురక్ష వైద్యులు ఖాజామొహిద్దీన్, బాలగురప్ప, రిషిత తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నాగరాజు


చిలంకూరులో రోగులకు కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు ఒక వరం లాంటిదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మండలంలోని నందిమండలం–2 గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్య శిబిరానికి వచ్చే రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్యం అందించి ఉచితంగా మందులు అందించాలన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా సరైన వసతులు కల్పించాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు ప్రజలకు త్వరగా అందజేయాలన్నారు. అనంతరం వైద్య శిబిరాన్ని పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి ఎంపీహెచ్‌ఈఓ ప్రసాద్, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, వైద్యులు వినయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు, చిన్నదుద్దూరు, ఇల్లూరు గ్రామాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రహమతులయ్య పాల్గొని మాట్లాడారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తుందన్నారు. అనంతరం ప్రజలకు వైద్యసేవలను అందించి మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిచరిత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

రేపు నగరంలో మహా శోభాయాత్ర

కడప కల్చరల్ : అయోధ్య ఐక్య వేదిక ఆధ్వర్యంలో కడప నగరంలో ఈనెల 21వ తేదీన శ్రీ రామ మహాశోభాయాత్ర నిర్వహించనున్నట్లు వేదిక ప్రతినిధులు తెలిపారు. ఈ శోభాయాత్ర చిన్నచౌకు ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభమై అప్సర సర్కిల్, వై–జంక్షన్, ఆర్టీసీ సర్కిల్, ఎస్పీ బంగ్లా, రాజారెడ్డివీధి, అన్నమయ్య సర్కిల్, కృష్ణా సర్కిల్, గోకుల్ సర్కిల్, వన్ టౌన్ సర్కిల్, పాత బస్టాండు సర్కిల్, ఏడురోడ్ల కూడలి, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, ఐటీఐ సర్కిల్, కాగితాలపెంట, సంధ్య సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్‌మార్గ్ మీదుగా హౌసింగ్‌బోర్డు కాలనీలోగల శ్రీ కోదండ రామాలయం వద్ద ముగుస్తుందన్నారు. అలాగే 22వ తేది ఉదయం 6 గంటలకు శ్రీరామ హోమం, ఆ తర్వాత భక్తుల స్వహస్తాలతో శ్రీ రామలక్ష్మణ, సీతా, ఆంజనేయుల విగ్రహాలకు అభిషేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అయోధ్యలో రామప్రతిష్ఠ జరిగే సమయంలో ఆలయంలో స్క్రీన్ ఏర్పాటు చేసి భక్తులకు ప్రతిష్ఠ కార్యక్రమం ప్రదర్శించే ఏర్పాట్లు చేశామన్నారు. ఈ శోభాయాత్రలో భక్తులు సంప్రదాయ వస్త్రధారణ (తెల్లని దుస్తులు)తో హాజరు కావాలన్నారు. అదేరోజు సాయంత్రం పాలకొండపై శ్రీరామ అఖండ దివ్యజ్యోతిని వెలిగిస్తామన్నారు.

కులగణన సర్వే పరిశీలన

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చేపడుతున్న కులగణన సర్వేని శుక్రవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో కులగణన సర్వే చేపట్టారన్నారు. సర్వేని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కులగణన ద్వారా ఇంటిలో ఎంతమంది ఉన్నారు వారి వివరాలు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఇంటి వద్దకు వచ్చే వలంటీర్లుకు, సచివాలయ సిబ్బందికి పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, కౌన్సిలర్లు కొండలరావు, భార్గవి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగలు శైలజా, అంకాలమ్మ ఆలయ చైర్మన్ ప్రసాదు, మాజీ కౌన్సిలర్ అరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసుదన్‌రెడ్డి, వీరా, దశరథరామిరెడ్డి, సుబ్బరత్నమ్మ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో.

వేంపల్లె : మండలంలోని 18 గ్రామ సచివాలయాల్లో కులగణను వేగవంతంగా పూర్తిచేయాలని ఎంపీడీఓ దివిజ సంపతి తెలిపారు. శుక్రవారం గండిరోడ్డులో ఉన్న ఎర్రదొడ్డి గంగమ్మ సమీపంలో కులగణన సర్వేని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక, రాజకీయ, సాధికారత కల్పిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం 10 రోజుల పాటు కులగణన సర్వేని ఏర్పాటు చేసిందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి కులాల వారీగా వివరాలు సేకరించాలన్నారు. ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించేందుకు గ్రామ వార్డు సచివాల య శాఖ ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను సిద్ధం చేసి 723 కులాల జాబితాను పొందపరచనున్నారని తెలిపారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలో జరుగుతున్న కులగణన సర్వేకు పట్టణ ప్రజలు సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ అన్నారు. శుక్రవారం సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి చేస్తున్న కులగణన సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని సూచించారు. 8వ సచివాలయంలో సర్వేను పరిశీలించారని కౌన్సిలర్ ఎరికలరెడ్డి తెలిపారు.


కులగణన సర్వేని పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి


ఎర్రగుంట్లలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ పి.జగన్నాథ్

జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యం

– ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకం అందించిన ఘనత వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నాగులకట్ట ప్రాంతం, వెంకటేశ్వర, భాగ్యనగర్ కాలనీలలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం వారి సమస్యలను తెలుసుకుని అధికారుల ద్వారా పరిష్కరించారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి పెద్ద పీటవేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను ఆయన నెరవేర్చారన్నారు. ప్రజలు కూడా మంచి చేసిన వారిని ఆదరించాలన్నారు. గతంలో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మర్చిపోయారన్నారు. భవిష్యత్తులో టీడీపీ అధికారంలోకి వస్తే ఎటువంటి సంక్షేమ పథకాలు ఇవ్వకపోగా ఉన్న వాటిని రద్దుచేస్తాడన్నారు. కార్యక్రమంలో హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ విజయలక్ష్మీ, కెకె రమణారెడ్డి, పోరెడ్డి మహేశ్వరరెడ్డి, చంద్రమౌళి, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హియరింగ్ ప్యాడ్స్ పంపిణీ

కమలాపురం : మండలంలోని పలువురు చెవిటి వారికి హియరింగ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. మండలంలో గతంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొంత మంది చెవిటి వారు తమకు చెవిటి మిషన్లు కావాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఆయన హియరింగ్ ప్యాడ్స్(చెవిటి మిషన్లు) పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు స్థానిక నాయకులు వాటిని అందజేశారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో ఈ హియరింగ్ ప్యాడ్స్‌ను నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, విజయేంద్రారెడ్డి, సురేష్ యాదవ్, నారపురెడ్డి, మైసూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హియరింగ్ ప్యాడ్స్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రభుత్వ పథకాలపై అవగాహన

పులివెందుల రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి శుక్రవారం పట్టణంలోని రమణప్పసత్రం పాఠశాల సమీపంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, హజరై మాట్లాడారు.

ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన అటల్ పెన్షన్ యోజనపథకాన్ని అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 నుంచి 40 సంవ్సరాలు వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. అలాగే ప్రధానమంత్రి జీవన జ్యోతి, ప్రధాన మంత్రి, సురక్షబీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సురక్ష బీమా యోజన పథకంలో చేరి కేవలం రూ. 20కే రూ.2 లక్షల ప్రమాద బీమా పొందవచ్చునన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన పథకాలపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భాను ప్రకాష్, జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, మెప్మా అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తులపైన అవగాహన


అవగాహన కల్పిస్తున్న జాతీయ సేవా పథకం అధికారులు

పులివెందుల రూరల్, లింగాల : పట్టణంలోని ఆహార సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా 7 రోజుల పాటు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం గ్రామంలో పండ్లు, చిరుధాన్యాలు, కూరగాయలు ఆధారిత ఉత్పత్తులు, తయారీ వ్యవసాయ, ఉద్యానపంటలు, పశుపోషణ తదితర అంశాలపై సర్వే నిర్వహించారు. జాతీయ సేవా పథకం అధికారి నజ్మా, డీస్‌ఎంఎస్ బేగ్‌లు రైతులు అధికారుల సూచనలు, సలహాలు జాగ్రత్తగా పాటించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కీర్తిరెడ్డి, ప్రవీణ్, రాజశేఖర్, సుబ్బారెడ్డి, వలంటర్లు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మందులు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు


వెల్లటూరులో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

పెండ్లిమర్రి : ఎరువులు, పురుగుమందుల దుకాణాదారులు రైతులకు నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని బద్వేల్ వ్యవసాయశాఖ ఏడీఏ నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి దుకాణాల్లో ఉన్న స్టాక్ రిజిస్టర్, వేబిల్లులు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు ఎరువులు అమ్మేటప్పుడు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలన్నారు. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ అమ్మితే అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు.

సంతకాల సేకరణ

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థ ప్రీమియంలపై జీఎస్టీని పూర్తిగా తొలగించాలని సంస్థ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. శుక్ర వారం 67వ జీవిత బీమా జాతీయకరణ దినోత్సవ సందర్భంగా కడప ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో సంతకాల సేకరణ చేపట్టారు.

ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్య దర్శి రఘునాథరెడ్డిలు మాట్లాడుతూ ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ అని తెలిపారు. ఎల్ఐసీని ప్రభుత్వరంగ సంస్థగా మరింత బలోపేతం చేయాలని, ఇన్సూరెన్స్ పాదుపు మొత్తాలకు ప్రత్యేకంగా ఆదాయం పన్ను రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని సంతకాలు చేసిన వారిలో ఏపీటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బారెడ్డి, సెరికల్చర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట రామరాజు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓబులేసు, పెన్షనర్ల సంఘం నేతలు శంకరరావు, సుధీకర్, చంద్రశేఖర్ రెడ్డి, ఎల్ఐసి యూనియన్ల నేతలు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి లెనిన్ శత వర్ధంతి సభలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఈనెల 21 నుంచి జిల్లా వ్యాప్తంగా లెనిన్ శత వర్ధంతి సభలను నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ లెనిన్ మరణించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా శత వర్ధంతి సభలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు.

జిల్లాలోని మండల, పట్టణ, నగర, జిల్లా కేంద్రాలలో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

వేంపల్లె : రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అందుకే జగనన్న శాశ్వత భూహక్కు.. భూరక్ష పథకాన్ని అమలు చేశారని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పాములూరు గ్రామంలో పేద రైతులకు జగనన్న భూహక్కు పత్రాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. మండలంలోని రైతు కుటుంబాలకు వ్యవసాయ అసైన్డ్ ఈనం, ఎస్పీ కార్పొరేషన్ తదితర వాటిల్లో 22 జాబితానుంచి తొలగించి పేదలకు భూములు పంపిణీ చేశారన్నారు. అందులో భాగంగా మండల వ్యాప్తంగా 399 మంది రైతులకు 62 ఎకరాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బయమ్మ, లక్ష్మిపావని, ఉప సర్పంచ్‌లు మధుప్రభాకర్‌రెడ్డి, రామగంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్

రుణమాఫీ ధృవీకరణ పత్రాల పంపిణీ

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో అర్హులైన డ్వాక్రా మహిళలకు శుక్రవారం 14వ వార్డు కౌన్సిలర్ విజయకుమార్ రుణమాఫీ ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగో విడత రుణమాఫీని తమ అకౌంట్లలో జమచేశారన్నారు. దీంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిల సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికి అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రుణమాఫీ ధృవీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్

అరటిలో తెగుళ్ల నివారణ చేపట్టండి

ఓబులవారిపల్లె : అరటిలో పోషక లోపం, తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలని వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆచార్యులు సీహెచ్ రూత్, డాక్టర్ కె.స్వరాజ్యలక్ష్మిలు పేర్కొన్నారు. శుక్రవారం వైకోట గ్రామంలో అరటి తోటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ జీ–9 రకానికి చెందిన అరటి మొక్కలకు పోషక లోపాలు, పండుటాకు తెగులు, ఆకు చివరన కుళ్లడం తదితర సమస్యలను గుర్తించారు. రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వలన అరటి గెలలు రావడానికి ఆలస్యమవుతుందన్నారు. పోషక లోపం నివారణకు 13 – 0.45(పొటాషియం నైట్రేట్)ను గెలలకు పిచికారీ చేయాలని సూచించారు. రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వాడటం రైతులు అలవరుచుకోవాలని సూచించారు. పండుటాకు తెగులు నివారణకు ప్రొపికోనజోల్ ఒక మిల్లీ లీటరు లీటరు నీటిలో కలిపి తెగులు సోకిన ఆకులకు పిచికారీ చేయాలన్నారు. అనంతరం అరటి సాగుపై సూచనలు, సలహాలు ఇచ్చారు.

22న కొత్త ఓటర్ల జాబితా విడుదల

జమ్మలమడుగు : నియోజకవర్గంలో కొత్త ఓటర్ల జాబితా 22న విడుదల అవుతుందని ఆర్డీవో జి.శ్రీనివాసులు తెలిపారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఫారం–6 కింద నూతన దరఖాస్తులను 2,254 మంది చేసుకున్నారు. అదేవిధంగా ఫారం–7 కింద 2889 మంది ఓటర్ల తొలగింపునకు వివిధ రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదు అందాయన్నారు. ఫారం–8 మార్పులు చేర్పులు, మరో పోలింగ్ కేంద్రానికి బదిలీల కోసం 1991 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అయితే ఫారం 6 కింద దరఖాస్తులు చేసుకున్న వాటిలో అధికారులు 1213 మందిని ఓటర్లగా అనుమతించారు. మరో 365 మంది ఫిర్యాదులను తిరస్కరించి, 676 మంది దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు. అదేవిధంగా ఫారం–7 కింద ఓటర్లను తొలగించాలంటూ 2889 మందిని తొలగించాలంటూ వివిధ రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదు అందగా అందులో 1901 మంది ఓటర్లను తొలగించగా, 296 మందిని తిరస్కరించగా, 692 మందిని పెండింగ్‌లో ఉంచామన్నారు.

మహిళ ఓటర్లే అధికం..

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 2,44,126 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళా ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. పురుషులు 1,18,989 మంది ఓటర్లు ఉండగా స్త్రీలు 1,25,104 మంది ఉన్నారు. 33 మంది థర్డ్ జండర్లు ఉన్నారు. ఆరు మండలాల్లో అత్యధికంగా జమ్మలమడుగు మండలంలో 63619 మంది ఓటర్లు ఉండగా ఎర్రగుంట్ల మండలంలో 60,016 మంది ఓటర్లు ఉన్నారు. ఆరు మండలాల్లో మొత్తం 315 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నియోజకవర్గ ఓటర్ల వివరాలు..

మండలం	ఓటర్లు	పురుషులు	స్త్రీలు
పెద్దముడియం	24,669	12065	12062
మైలవరం	32840	16180	16659
జమ్మలమడుగు	63619	30713	32886
కొండాపురం	35670	17349	18317
ముద్దనూరు	27320	13339	13978
ఎర్రగుంట్ల	60016	29343	30670


జమ్మలమడుగు పట్టణ వ్యూ

7వేలకు పైగా ఓట్లను తొలగించాం



నియోజకవర్గంలో ఏడువేలకు పైగా దొంగ ఓట్లతోపాటు మరణించిన వారి ఓట్లను తొలగించాము. ఇంకా క్షేత్రస్థాయిలో దొంగ ఓట్లపై సర్వే నిర్వహిస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారిని ఓటర్లుగా ఎక్కించే ప్రయత్నం చేస్తున్నాము. ఈనెల 22వ తేదీన పూర్తిస్థాయిలో ఓటర్ల జాబితాను విడుదల చేస్తాం.

జి.శ్రీనివాసులు ఆర్డీఓ, జమ్మలమడుగు.